క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేయాలి



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. మంగళవారం అగర్‌గూడ గ్రామంలో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు కిష్టయ్య, చంద్రశేఖర్, గ్రామస్తులు ఉన్నారు.

రైతుల ఖాతాల్లోకి నిధులు

పెంచికల్‌పేట్/ లింగాపూర్/ రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం నిధులను రైతుల ఖాతాల్లోకి విడుదల చేసింది. పెంచికల్‌పేట్ మండలంలోని 4396 మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,76,56,723 నగదు జమ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మనీషా తెలిపారు. మిగతా 2051 మంది రైతుల ఖాతాల్లో త్వరలోనే జమ కానున్నట్లు పేర్కొన్నారు. లింగాపూర్ మండలంలో మొత్తం 5790 లబ్ధిదారులు ఉండగా ఇప్పటివరకు 2204 మంది రైతుల ఖాతాల్లోకి రూ.2,59,69,350 నిధులు జమ చేసినట్లు ఏవో సంజయ్ కుమార్ తెలిపారు. రెబ్బెన మండలంలో 13,273 మంది రైతులు ఉండగా 7494 మందికి రూ. 6,69,46,364 జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి దిలీప్ కుమార్ తెలిపారు.

'పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలి'



మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్

దహెగాం: వర్షాకాలం సీజన్ కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. మంగళవా రం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీ డబ్ల్యూ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మా ట్లాడుతూ వరదలు వచ్చిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వర్షాకా లంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కాచి చల్లార్చి వడపోసిన నీళ్లను తాగాలన్నారు. దోమ తెరలను వినియోగించాలని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్, పీఆర్ ఏఈ ఆత్మారాం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి గ్రామానికి బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ ఉర్మిల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండి వాగు వద్ద నూతనంగా కరెంట్ టవర్ ఏర్పాటు పనులు చేస్తున్నందున గుండి గ్రామ పంచాయతీలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

'చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి'

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రం-2లో మంగళవారం అమ్మ మాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపించాలన్నారు. ఆటపాటలతో పాటు చదువు నేర్పిస్తామన్నారు. గుణసుందరి, జ్యోతిక, మానస, శకుంతల, సరిత, అపర్ణ, భూమిక ఉన్నారు.

బెజ్జూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ రాచకొండ స్వప్న అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమశిక్షణతో కూడిన చదువు, పౌష్టికాహారం అందుతుందన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మీసరి వైకుంఠం అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల దాడులు

కౌటాల: మండలంలోని గుడ్లబోరి, జనగాం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన ఎరువులు, విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి విచారణ కొనసాగుతుందని, పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏవో ప్రేమలత తెలిపారు.

మట్టిలోనే విత్తుతున్నారు!



గోయగాంలో విత్తనాలు వేస్తున్న కూలీలు

- మృగశిర సెంటిమెంట్
- ఇప్పటికే 50శాతం సోయింగ్ పూర్తి
- అనుకున్న స్థాయిలో పడని వానలు

కెరమెరి: మృగశిర కార్తెలో విత్తనాలు విత్తిన రైతులు అనుకున్న స్థాయిలో వానలు పడకపోవడంతో దిగాలు చెందుతున్నారు. ఏరువాక పున్నమి తర్వాత అనేక మంది రైతులు పొలం చదును చేసి, నేలలో తడి లేకున్నా మట్టిలో విత్తనాలు వేశారు. ఏరువాక రోజుల్లో వర్షాలు తప్పక కురుస్తాయని భావించిన రైతులకు నిరాశే మిగిలింది.

50 శాతం పూర్తి..

మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 156 గ్రామాలు ఉన్నాయి. అందులో 90 శాతం మంది వ్యవసాయం మీదే ఆధారపడి ఉన్నారు. మృగశిర కార్తెలోనే విత్తనాలు నాటాలనే సెంటిమెంట్‌తో వానలు కురవకున్నా మండలంలో 50శాతం మంది రైతులు ఇప్పటికే విత్తనాలు విత్తారు. మరికొందరు వరణుడి కరుణకు నిరీక్షిస్తున్నారు. వానలు పడ్డాక విత్తనాలు నాటుదామని ఎదురు చూస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు విత్తనాలు వేసి స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నీటిని విడుదల చేస్తున్నారు. కాగా విద్యుత్ కోతలు అధికం కావడంతో వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.



సుర్దాపూర్‌లో సారెలు కొడుతున్న రైతు

26వేల ఎకరాల్లో పత్తి సాగు

మండలంలో మొత్తం 8,194 మంది రైతులు ఉన్నారు. మొత్తంగా 25160 ఎకరాల్లో పత్తి సాగు చేసుకునేందుకు రైతులు ప్రణాళికలు చేసుకున్నారు. గతంతో పోలిస్తే ఈసారి వానలు బాగా కురుస్తాయని అనుకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పడలేదు. ఎండలు కూడా మండిపోతుండడంతో విత్తనాలు మాడిపోతాయన్న భయం వారిలో నెలకొంది.

మృగశిరలో విత్తితే మంచిది



మృగశిరలో విత్తనాలు విత్తితే మంచిదని అందరూ చెబుతున్నారు. అందుకే వానలు కురవకున్నా మట్టిలోనే విత్తనాలు విత్తుతున్నాం. మరో నాలుగు రోజుల్లో వానలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో కొంత ఆశ ఉంది. – కేంద్రే బాలాజీ, ధనోరా

జీవో 49 వెంటనే రద్దు చేయాలి



కాగజ్‌నగర్‌టౌన్: సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



పెంచికల్‌పేట్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



బెజ్జూర్: వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు


కాగజ్‌నగర్‌టౌన్: కుమురం భీం జిల్లాను టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 49ను రద్దు చేయాలని కోరుతూ కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాకు మంగళవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివకుమార్, మండల అధ్యక్షుడు పుల్ల అశోక్‌ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ 49 జీవోతో జిల్లా అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందని, ప్రజలకు జీవనోపాధి కరువవుతుందన్నారు. అటవీ ప్రాంతాల గిరిజనులు, స్థానికులను, ఎమ్మెల్యేలను సంప్రదించకుండా ఏకపక్షంగా జీవోను జారీ చేయడం రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరికి నిదర్శనమన్నారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట జీవో 49 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చేరాల శ్రీనివాస్, కొండు తిరుపతి, పట్టణ బీజేవైఎం అధ్యక్షుడు వెంకటేశ్, ఎస్సీ మోర్చ పట్టణ అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి, బీజేపీ సీనియర్ నాయకులు గజ్జెల లక్ష్మణ్, గన్నారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు తిరుపతి, సంపత్, కోట వేణు, బాపురావు, నరేశ్, మొండి, శేఖర్, కార్తీక్, శ్రీనివాస్, అర్కిలె అశోక్, లొనారె రవీందర్, ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రభుత్వం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో టైగర్ కన్జర్వేషన్ కోసం విడుదల చేసిన జీవో 49 వెంటనే రద్దు చేయాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ పుష్పలతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులను భూముల్లో నుంచి వెళ్లగొట్టే ఆలోచనతో ప్రజాప్రతినిధులను సంప్రదించకుండానే జీవో విడుదల చేయడం ఏంటని ప్రశ్నించారు. అంతకు ముందు జీవో ప్రతులను దహనం చేశారు. నాయకులు సంతోష్, కాంతారావు, నగేశ్, రాజన్న, వైకుంఠం, భాస్కర్, నానయ్య, రవి, కిషన్, తుకారాం, ప్రభాకర్, శ్రీనివాస్, ప్రభాకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


బెజ్జూర్: బీజేపీ మండల అధ్యక్షుడు జాడి తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో జీవో 49 ప్రతులను దహనం చేశారు. 'కాంగ్రెస్ డౌన్‌డౌన్, జీవో నం.49 రద్దు చేయాలి' అని నినాదాలు చేశారు. అనంతరం జీవోను రద్దు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు జాడి డిగంబర్, వసీఉల్లాఖాన్, గిరిజన నాయకులు మెస్రం రాజారామ్, సామల తిరుపతి, కోర్తె తిరుపతి, గూడ రాజేశ్వర్, ఎల్కరి సంజు, కిషన్ గోపాల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెబ్బెన: ఆదివాసీ గిరిజన, పేద ప్రజల జీవితాలపై ప్రభావం చూపే జీవో 49ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జీవో 49 పత్రాలను బీజేపీ నాయకులు దహనం చేసిన అనంతరం తహసీల్దార్ సూర్యప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రామగిరి సతీశ్, మండల కోశాధికారి మధూకర్, సోషల్ మీడియా కన్వీనర్ మహేందర్ గౌడ్, నాయకులు వెంకన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత విద్యతో విద్యార్థులకు మేలు



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న విజయ నిర్మల



వాంకిడి: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: సమ్మిళిత విద్యతో విద్యార్థులకు మేలు జరుగుతుందని పెంచికల్‌పేట్ క్లాంపెక్స్ హెచ్ఎం విజయ నిర్మల అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సమ్మిళిత విద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు భవిత కేంద్రాలు వరంగా మారాయన్నారు. భవిత కేంద్రాల్లో విద్యార్థులకు విద్యతో పాటు ఫిజియోథెరఫి నిర్వహిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సుజాత, ఐఈఆర్‌పీ సుజాత, ఉపాధ్యాయులు భాగ్య, సతీశ్, సీఆర్‌పీలు శ్యాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని భవిత కేంద్రం, ఎంపీపీఎస్ వాంకిడి కలాన్ పాఠశాలలో మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా సమ్మిళిత విద్య -బాలికలకు విద్య అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, అధికారులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన దివ్యాంగ విద్యార్థి విజయ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం మండల విద్యాధికారి శివచరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం నటరాజ్, ఐఈఆర్పీ తిరుమల, పాఠశాల హెచ్ఎం వినేష్ ఉప్రె, ఉపాధ్యాయులు రాయమల్లు, సతీశ్, ముబీన, ప్రియాంక, సీఆర్పీలు సునీల్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: బడిబాటలో భాగంగా దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించినట్లు ఎంఈవో సుభాష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పాఠశాలలో మంగళవారం ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ డేలో భాగంగా దివ్యాంగులను గుర్తించి పాఠశాలలో అడ్మిషన్ చేయించారు. అడ్మిషన్ పొందిన ఇద్దరు దివ్యాంగుల పిల్లలకు జిల్లా కేంద్రంలోని భవిత సెంటర్‌లో చదువుతో పాటు సౌకర్యాలు కల్పించామన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వార్డు నంబర్ 14 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విలీన విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మహేంద్ర చారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెబ్బెన: అన్ని వర్గాల పిల్లలకు సమాన విద్యావకాశాలు కల్పించడమే సమగ్ర విద్య కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గోలేటిటౌన్‌షిప్‌లో మంగళవారం జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సమగ్ర విద్యపై అవగాహన కల్పించారు. తక్కళ్లపల్లి కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్ఎం అర్జున్, డీఎస్‌టీ పాఠశాల హెచ్ఎం లావణ్య, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు ప్రశాంత్, సౌజన్య, ఐఈఆర్‌పీ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కౌటాల: దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు చదివించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. బుధవారం కౌటాల భవిత కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం గణపతి, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: అన్నివర్గాల పిల్లలకు సమాన విద్య అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని మండల విద్యాధికారి సునీత అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం విలీన విద్య, బాలిక దినోత్సవాన్ని బెజ్జూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ జుమ్మిడి మహేశ్వరి, ఐఈఆర్పీ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న తాజ్‌బాబా

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యపై కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లాకు తెలంగాణ ఉద్యమకారుడు ఎండీ తాజ్‌బాబా మంగళవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన కార్యాలయానికి వెళ్లగా అనుమతి లేకుండా లోనికి ఎందుకు వచ్చావంటూ ఇష్టారీతిగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజలపై దురుసుగా ప్రవర్తించే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

20న సీపీఐ మహాసభ

ఆసిఫాబాద్‌రూరల్: సీపీఐ మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో జరిగే సీపీఐ మహాసభకు రాష్ట్ర కార్యదర్శి కలవేన శంకర్ హాజరవుతారని తెలిపారు.

'పీఎం జుగా'పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

లింగాపూర్: ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజన గ్రామాల అభివృద్ధికి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జుగా (జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్) కార్యక్రమంపై మంగళవారం మండలంలోని వంకామద్ది గ్రామంలో ఎంపీవో రజనీకాంత్, సీఆర్పీ బుచ్చిరాం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎంపీవో రజనీకాంత్ మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామపంచాయతీలకు గాను తొమ్మిందింటిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జగదీశ్, శ్రీనివాస్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

అంగవైకల్యం ఉన్నా 'ఆసరా' కరువు

- పింఛన్ మంజూరులో అధికారుల అలసత్వం



అంగవైకల్యంతో ఉన్న శ్రీకాంత్

కెరమెరి: కళ్ల ముందు అంగవైకల్యం కన్పిస్తున్నా.. ఆసరా పింఛన్ పొందడానికి అన్ని అర్హతలు ఉన్నా అధికారులు పింఛన్ మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో మండలంలోని లక్మాపూర్ గ్రామానికి చెందిన ఇస్లావత్ శ్రీకాంత్ అనే దివ్యాంగుడు అనేక ఇబ్బందులు పడుతున్నాడు. పుట్టుకతోనే శారీరక అంగవైకల్యం ఉన్న ఆయనను తల్లి కూలీ పనులు చేసుకుంటూ పెంచుతుంది. సదరం సర్టిఫికెట్ కూడా ఉన్నప్పటికీ అధికారులు పింఛన్ ఇప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. 'పింఛన్ మంజూరు చేయండి మహా ప్రభో..' అంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని శ్రీకాంత్ వాపోతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసరా పింఛన్ కల్పించాలని వేడుకుంటున్నాడు.

కాలిబాటలే రహదారులు..!



బురదమయంగా రోడ్డు

- బురదమయంగా గ్రామీణ రోడ్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తిర్యాణి: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. గ్రామాల నుంచి బయటకు రావాలంటే గ్రామస్తులకు ఎడ్లబండే దిక్కవుతోంది. కనీసం అంబులెన్స్‌లు వచ్చే పరిస్థితి కూడా లేకపోవడంతో అత్యవసర సమయంలోనూ గర్భిణులు, రోగులను ఎడ్లబండ్లలోనే తరలించాల్సిన దుస్థితి ఉంటుంది. కొన్ని గ్రామాలకు వెళ్లే దారులు మోకాలు లోతు బురద ఉండటంతో ఎడ్లబండ్లు కూడా దిగబడి పోతున్నాయి. దీంతో ఆదివాసీల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలోని తాటిగూడ, ఎర్రబండ, గీసుగూడ, పూనగూడ, కొత్తగూడ, కౌటగాం గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఈ మారుమూల గ్రామాల్లో గోండు, కొలాం తెగలకు చెందిన గిరిజనులు నివసిస్తున్నారు.

కాలిబాటలే దిక్కు..

గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో అడవి బాటలు (రోడ్డు) ఆదివాసీలకు దిక్కుగా మారుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ కాలు తీసి కాలు పెట్టలేనంత బురదగా మారుతున్నాయి. ఒక్కోసారి దారి ఆనవాళ్లు కూడా కనబడని దుస్థితి నెలకొంటుంది. ఏటా వర్షాకాలంలో ఈ గ్రామాలకు బహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. సరైన రహదారి లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోతోంది. దీనికి తోడు గ్రామాలకు వెళ్లే దారిలో వాగులు ఉండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఈ సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని నడక..

వర్షాకాలంలో గ్రామాలకు వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండకపోవడంతో కాలినడకనే వారికి శరణ్యం. ప్రతీ నెల నిత్యావసర సరుకుల కొనుగోలుకు, రేషన్ బియ్యం తీసుకోవడానికి, ఆసరా పింఛన్ల కోసం సుమారు ఆరు కిలోమీటర్ల కాలినడకన దాంపూర్ చేరుకుంటారు. అక్కడి నుంచి ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో తిర్యాణి మండల కేంద్రానికి చేరుకుని అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మించాలి



దాదాపు ఆరు కిలోమీటర్ల మేర అడవి దారంతా బురదమయంగా మారింది. మోకాళ్ల లోతు బురదలో నడవడానికి అవస్థలు పడుతున్నాం. గ్రామానికి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో కాలినడకన వెళ్తున్నాం. అత్యవసర సమయంలో సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి వాగులపై కల్వర్టులు నిర్మించడంతో పాటు రోడ్డు నిర్మాణం చేపట్టాలి. – కోట్నాక గణపతి, తాటిగూడ



ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఒర్రె పక్కన పడేసిన ముబిగిపోయిన ఫలాలు, చెత్త

రోడ్డుపైనే వ్యర్థాలు..!



రోడ్డ పక్కనే వ్యర్థాలు పడేయడంతో రోడ్డుపైకి లాక్కొని తింటున్న పశువులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని రోడ్డు పక్కనే కూరగాయలు, పండ్ల వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యర్థాలు పారవేస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు పక్కనే కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలు పడేస్తుండడంతో వాటి కోసం పశువులు నిత్యం అక్కడే సంచరిస్తున్నాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఉదయం చెత్తను తొలగించినా మళ్లీ అక్కడే చెత్త వేస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పక్కనే చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.